క్లుప్తంగా

శివాలయంలో అభిషేకం



పూజలో పాల్గొన్న భక్తులు

కెరమెరి: ఆంజనేయ దీక్షా స్వాముల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని శివాలయంలో అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, కలశ, ఆంజనేయ స్వామికి పూజల అనంతరం పూలు, పళ్లు, తేనే, పెరుగు పంచ దారలతో అభిషేకం చేశారు. కంతల్‌వార్ నాగ్‌నాథ్, గుర్నూలే బాలాజీ, కిలిపాక సంతోష్, రాథోడ్ వికాస్, గుజ్జుల బాలాజీ, సెండే తిరుపతి, రాథోడ్ గోపాల్, విక్రమ్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో శనివారం మండలంలోని కొఠారి, ఝరి బస్టాండ్ ప్రాంతంలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎంపీడీవో అంజద్‌పాషా ప్రారంభించారు. ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి కాలం ముగిసే వరకు చలివేంద్రం కొనసాగుతుందని, రానున్న రోజుల్లో ప్రధానరోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రతీ బస్టాండ్ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన తరగతులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఫిజిక్స్‌లోని అంశాలపై పది రోజుల పాటు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిజిక్స్‌లోని కీలకాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా తరగతులకు హాజరు కావాలని సూచించారు.

'పౌరహక్కులు అందరికీ సమానమే'



మాట్లాడుతున్న అధికారులు

కెరమెరి: పౌరహక్కులు, ప్రాథమిక హక్కులు అన్ని వర్గాల ప్రజలకు సమానమేనని తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అంజద్‌పాషా, ఎస్సై గుంపుల విజయ్ అన్నారు. శనివారం మండలంలోని ఝరి గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎవరికైన ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియజేయాలని, సమస్యలను బట్టి తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, విద్యుత్ ఏఈ రమేశ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పటేళ్లు, గ్రామస్తులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



రవీందర్ దంపతులను సన్మానిస్తున్న మిత్రులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన న్యాయవాది రాపర్తి రవీందర్‌ను శనివారం బాల్య మిత్రులు, హోలీ ట్రినిటీ పాఠశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిత్రులు అలిబిన్ అహ్మద్, రావుల వెంకన్న, తిరుపతి, ఎండీ ముషీరొద్దీన్, గిరిధర్, సత్యం, శ్రీకాంత్, షమీ పాల్గొన్నారు.

నేడు పంచాంగ పఠనం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా తెలిపారు. ఉదయం 9.45 గంటలకు వేదపండితులు ముద్దు నరహరి శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఉంటుందని పేర్కొన్నారు.

శివుడి సన్నిధిలో 'ఉగాది'



శంకర్‌లొద్ది గుహలోని శివలింగం



శివ లింగాన్ని దర్శించేందుకు ఏర్పాటు చేసిన మెట్లు, జెండాలు

- నేడు శంకర్‌లొద్దిలో పర్వదిన సంబరాలు
- ప్రేంసింగ్ మహరాజ్ తపస్సు చేసిన స్థలం
- ఉమ్మడి జిల్లా నుంచి తరలిరానున్న భక్తులు
- నేడు పోహరాదేవికి భక్తుల పాదయాత్ర

కెరమెరి: మండలంలోని పవిత్ర క్షేత్రం శంకర్‌లొద్ది ఉగాది పర్వదినాన జనసంద్రం కానుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది సేవాలాల్ భక్తులు, తండోపతండాలుగా తరలివచ్చి 'ఉగాది' పర్వదినాన్ని జరుపుకోనున్నారు. అలాగే పవిత్రమైన ప్రాంతాన్ని ఆదివాసీ గిరిజనులు సిద్దికసగా పిలుస్తారు. కరంజివాడ గ్రామపంచాయతీలోని శంకర్‌లొద్ది బంజారా గురువు తపస్వీ ప్రేంసింగ్ మహరాజ్ ఆరేళ్ల తపస్సు చేసిన పవిత్ర స్థలంగా చెబుతుంటారు. ఏటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఇక్కడ జాతర నిర్వహిస్తారు. 20ఫీట్ల ఎత్తులోని గుహలో ఉన్న శివలింగాన్ని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. తపగురు శ్రీ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్ భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేస్తారు.

దుర్గాదేవి, సేవాలాల్‌కు పూజలు..

ఈ సందర్భంగా అనేక మంది సేవాలాల్ భక్తులు పాదయాత్రతో ఇక్కడికి వస్తారు. శంకరునితో పాటు దుర్గాదేవి, సేవలాల్ మహరాజ్‌కు పూజలు నిర్వహిస్తారు. కొలువై ఉన్న జెండాలకు, ప్రతిమలకు పూజలు నిర్వహిస్తారు. గంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఏటా రెండుసార్లు జరిగే జంగుబాయి ఉత్సవాలకు వెళ్లే ఆదివాసీ గిరిజన భక్తులు శంకర్‌లొద్దిలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఆదివాసీలు దీన్ని 'సిద్దికస' గా పిలుస్తారు. కాగా వేలాది మంది భక్తులు తరలివచ్చే ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించడంలో అధికారులు, ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.



శివ లింగం ఉన్న గుహ

పోహరాదేవికి పాదయాత్ర

మహారాష్ట్రలోని వాజీమ్ జిల్లాలో ఉన్న పోహరాదేవికి ఆదివారం సేవాలాల్ భక్తులు పాదయాత్రగా బయలుదేరనున్నారు. శంకర్‌లొద్దిలో శివునికి ప్రత్యేక పూజల అనంతరం నేడు కాలిబటతో బయలుదేరుతారు. సుమారు 5 వేల మంది భక్తులు ఇక్కడ వెళ్లనున్నారు. శంకర్‌లొద్ది నుంచి సుమారు 280 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోహరాదేవికి శ్రీరామనవమి రోజున చేరుకుంటారు. అక్కడే మాల విరమణ చేస్తారు.

భోగ్‌భండార్ నిర్వహిస్తాం..



శంకర్‌లొద్దిలో నిర్వహించే ఉగాది పర్వదినం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు భోగ్‌భండార్ నిర్వహిస్తాం. అనంతరం అన్నదానం చేస్తాం. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కాగా పోహరాదేవికి వెళ్లే భక్తుల పాదయాత్ర నేడు ప్రారంభమవుతుంది.

– రాథోడ్ శంకర్ నాయక్, సేవాలాల్ ఉత్సవ కమిటీ గౌరవఅధ్యక్షుడు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ జమీర్, ఆయేషా తబస్సుమ్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ దండె విఠల్ కృషితో ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి జమీర్‌కు రూ.60వేలు, ఆయేషా తబస్సుమ్‌కు రూ.10,500లను మంజూరు చేసిందన్నారు. ఆపద సమయంలో పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఇమ్రోజ్ అలీ, మజీద్ కమిటీ అధ్యక్షుడు జహీర్‌బాబా, మైనార్టీ నాయకులు నాసిర్ ఉస్మానీ, ఆరీఫ్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న సుదర్శన్‌గౌడ్

పీహెచ్‌సీలో సికిల్‌సెల్‌పై అవగాహన

లింగాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సికిల్‌సెల్‌పై ఆశ వర్కర్లకు డాక్టర్ మధుకర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధుల లక్షణాలు, చికిత్సపై ఆశవర్కర్లు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ దత్తారాం, ల్యాబ్‌టెక్నీషియన్ అశోక్, సంధ్యారాణి, సంతోష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు మధుకర్

ఉపాధి పనులు గుర్తించాలి

కెరమెరి: ఏప్రిల్ నుంచి ప్రారంభించే నూతన ఉపాధిహామీ పనులను గుర్తించాలని ఎంపీడీవో అంజద్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీ కూలీకి వంద రోజులు పనులు కల్పించాలన్నారు. నె లాఖరు వరకు జరిగిన అన్ని పనులకు పేమెంట్ జరపాలన్నారు. కార్యక్రమంలో ఈసీ ఐక్యానాయక్, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోయవాగు గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. నీటి నిలువ కుంటల నిర్మాణ పనులను పరిశీలించారు. కూలీలకు రూ.300ల కూలీ వచ్చే విధంగా కొలతలతో పని చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున వంద రోజులు దగ్గరలో ఉన్న ఉపాధిహామీ జాబ్‌కార్డుదారులకు పనులు కల్పించి వందరోజులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో బుచ్చన్న, టెక్నికల్ అసిస్టెంట్ రమాదేవి, కిశోర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

ఉత్సాహంగా ఉగాది సంబరాలు

రెబ్బెన: మండలంలోని రెబ్బెన ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పండుగ వాతావరణం ఉట్టిపడేలా విద్యార్థులు ఉగాది పచ్చడిని తయారు చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఉగాది పండగ ప్రాముఖ్యత విద్యార్థులకు తెలియచేయాలనే లక్ష్యంతో ముందస్తు సంబరాలు నిర్వహించామని ఉపాధ్యాయులు తెలిపారు.



ఉగాది సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

బెజ్జూర్: మండలంలోని కుకుడ గ్రామంలో ఎన్ఆర్ఈ జీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు జాడి తిరుపతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వమే కారణమన్నారు. మాజీ సర్పంచులు వసిఉల్లాఖాన్, బాబాజీ, సంతోష్, కిష్టయ్య, కిషన్, గోపాల్, సంజీవ్, శివరాం, లింగయ్య, తిరుపతి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న నాయకులు

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

వాంకిడి: మండలంలోని లంజన్వీర గ్రామంలో ఆదివారం నుంచి నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో యువతలో నూతనోత్సాహం కలుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. వివరాలకు 88974 49607, 95028 03723 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నిర్వాహకులు గుర్నులె విఠల్, శ్రీహరి, రాంచందర్, గిరిధర్, కిశోర్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో

కాగజ్‌నగర్‌రూరల్: సెయింట్ క్లారిటీ పాఠశాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శనివారం ఎంఈవో వాసాల ప్రభాకర్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని ప్రిన్సిపాల్ బీజు జోసెఫ్‌కు సూచించారు. విద్యార్థులను ఆరుబయట నిలబెట్టకూడదని, ఫీజుల విషయమై తల్లిదండ్రులను ఫోన్ ద్వారా అడగాలని సూచించారు. అనంతరం శుద్ధనీటి ప్లాంట్‌ను, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు.

పోరుగ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించాలి

ఆసిఫాబాద్: జల్.. జంగల్.. జమీన్ కోసం పోరాడిన గిరిజన వీరుడు కొమురంభీమ్ నడయాడిన పోరు గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రత అధికంగా ఉందని తెలిపారు. తిర్యాణి, గుండాల, మంగి, రింగన్‌ఘాట్‌తో పాటు పోరుగ్రామాలైన జోడేఘాట్, బాబేఝరి, పాటగూడ, గ్రామాల్లో నీటి సమస్య ఉందని పేర్కొన్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు దుర్గం దిన్‌కర్, మంజం ఆనంద్, గొడిసెల కార్తిక్, సాయి, టికానంద్ పాల్గొన్నారు.

వారసంత వేలం



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి అబ్దుల్ నదిమొద్దీన్

బెజ్జూర్: మండల కేంద్రంలోని వారసంత వేలాన్ని శనివారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ప్రత్యేక అధికారి అబ్దుల్ నదిమొద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంలో వారసంతను గ్రామానికి చెందిన సామల వెంకటేశ్ రూ. 3లక్షల 30వేలకు దక్కించుకున్నారు. అంతకు ముందు గ్రామస్తులు వారసంతలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. వేలంలో పంచాయతీ కార్యదర్శి తుకారాం, కారోబార్ వసంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టు జారిందో.. పడిపోతారు!



దహెగాం: సమయానికి ఆర్టీసీ బస్సు సేవలు లేకపోవడంతో పదో తరగతి పరీక్షలు రాసేందుకు వెళ్లే విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. శనివారం విద్యార్థులు ప్రైవేటు వాహనంలో వేలాడుతూ ప్రయాణం చేశారు. ప్రమాదకర ప్రయాణంలో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రమాద ప్రయాణాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు సన్మానం

కాగజ్‌నగర్‌రూరల్: అసెంబ్లీలో తమ సమస్యలను ప్రస్తావించినందుకు ఎమ్మెల్యే హరీశ్‌బాబును మన్నెవార్, కొలవార్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు శాలువాతో సత్కరించారు. అసెంబ్లీలో తమ కులం సర్టిఫికెట్ విషయంపై ప్రస్తావించారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన్నెవార్, కొలవార్ కులస్తుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొలవార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల రామస్వామి, కుర్మ రాజు, కోశాధికారి బాపు, రాష్ట్ర యువజన అధ్యక్షుడు డబ్బా గోపాల్, జిల్లా అధ్యక్షుడు బాపు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్రి రూపేశ్, నాయకులు నాయిని సిద్దయ్య, వెంకటేశ్, సుగుణాకర్, హన్మంతు, భీంరావు, పోషన్న తదితరులు పాల్గొన్నారు.



హరీశ్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

దివ్యాంగులకు బాసటగా నిలవాలి

దివ్యాంగులకు సమాజం బాసటగా నిలువాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఆల్మికో, బీడీఎల్ సహకారంతో దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్లు, కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. అనంతరం అంకుసాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

ఉద్యోగులకు పదవీ విరమణ అనివార్యం



రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనివార్యమని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తూ శనివారం పదవీ విరమణ పొందిన ఎస్సై మాదం రాజేశ్వర్‌ను శాలువాలతో సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్సై వరకు పదోన్నతి పొంది 43 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో రాజేశ్వర్ సేవలందించారన్నారు. జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఆర్ఐ అంజన్న, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, డీపీవో ఏవో శ్రీనివాస్ రెడ్డి, సీసీ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాదికి ప్రకృతి స్వాగతం




తీగదరి పూలు

ఉగాది.. రుతువులను అనుసరించి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే పండుగ. వసంత రుతువులో వచ్చే ఈ పండుగకు ప్రకృతి కూడా స్వాగతం పలుకుతుంది. అడవుల్లో ప్రత్యేకంగా కన్పించే మోదుగు, తీగదరి, బూరుగు, ఇప్పచెట్లు ఆకులు పూర్తిగా రాలి పూలతో దర్శనమిస్తున్నాయి. మోదుగు, ఇప్ప, బూరుగు, తీగదరి పూలు ప్రజల జీవనశైలి, సాంప్రదాయ పూజలు, ఆయుర్వేద వైద్యంలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి.

– చింతలమానెపల్లి



బూరుగు పూలు



ఆదివాసీలు సేకరించిన ఇప్పపూలు